క్లుప్తంగా

జేవీకేను సద్వినియోగం చేసుకోవాలి



పాఠశాలలో భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, ఎంఈఓ ప్రకాష్

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యాకానుక(జేవీకే) తదితర పథకాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంఈఓ మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట శివారు నాగాబత్తువారిపాలెంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ అమ్మఒడి పథకం పొందాలంటే ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ, ఎంఈఓలు పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. వంట చేసే ప్రాంతం శుభ్రంగా ఉంచాలన్నారు. సీఆర్పీ టి.నాగరాజు, మైలా ఆనందరావు తదితరులు వారి వెంట ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అలమూరు: మండలంలోని చొప్పెల్ల సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం డీఈ వై.విజయానంద్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామన్నారు. కావున సబ్‌స్టేషన్ పరిధిలోని జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, చెముడులంక, మడికి, బడుగువానిలంక గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వేంకటేశ్వరుని సన్నిధిలో తానా సభ్యులు

ఆలమూరు: మండలం గుమ్మిలేరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామిని శనివారం తానా సభ్యులు కన్నెగంటి తులసికృష్ణ-శ్రీలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడానికి అనువుగా ఉండే విధంగా షెడ్డు నిర్మాణానికి అయ్యే రూ.2.5 లక్షల విరాళాన్ని వారు ప్రకటించారు. కార్యక్రమంలో రెడ్డి సత్తిబాబు, గుణ్ణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ



జి.అగ్రహారంలో సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అనురాధ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారానికి చెందిన మాజీ ఇన్‌చార్జి ఎంపీడీఓ విత్తనాల సుబ్బారావు ఈ నెల 26న మృతి చెందడంతో అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే సోదరుడు కె.వెంకటేశ్వరరావు శనివారం పరామర్శించారు. సుబ్బారావు కుమారుడు శేఖర్, కోడలు దుర్గాభవానీలను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. తొలుత సుబ్బారావు చిత్రపటం వద్ద ఎంపీ శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ నేతల నాగరాజు, సొసైటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు తదితర నాయకులు పరామర్శించిన వారిలో ఉన్నారు. అంతకుముందు పితృ వియోగంతో బాధపడుతున్న కొర్లపాటి కోటబాబును ఎంపీ అనురాధ పరామర్శించారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం

రావులపాలెం: రక్తదానం ప్రాణదానంతో సమానం అని స్వామి వివేకానంద యోగా ఆశ్రమం గురువు శ్రీనివాస్ అన్నారు. అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పలువురికి రక్తం అవసరం కావడంతో స్థానిక యోగా ఆశ్రమం సభ్యులు 15 మంది వారికి రక్తదానం చేశారు. యోగా గురువు శ్రీనివాస అధ్వర్యంలో 15 మంది యోగా సభ్యులు అమలాపురం బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్త దానం చేసినట్టు శ్రీనివాస్ శనివారం తెలిపారు.

హైస్కూల్‌కు రూ.50 వేల విరాళం

పి.గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవంలో భాగంగా పి.గన్నవరం సొసైటీ కమిటీ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ శనివారం తమ సొసైటీ తరఫున కామన్‌గుడ్ ఫండ్ నుంచి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం ఆట వస్తువుల కొనుగోలుకు రూ.50 వేలను ఎమ్మెల్యే చిట్టిబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల సహకార జిల్లా విద్యాధికారి ఆదిమూలం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. సొసైటీ పాలకవర్గాన్ని పలువురు అభినందించారు.

టీడీపీ నిరసన

మామిడికుదురు: స్థానిక బస్టాండ్ కూడలిలో 216వ నంబర్ జాతీయ రహదారిపై అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద టీడీపీ నాయకులు శనివారం నిరసన తెలిపారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని, రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలపై దౌర్జన్యాలు, అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆరోపించారు.

రైతులకు కొండంత అండగా..

- వ్యవసాయానికి అన్ని విధాలా ప్రభుత్వ ప్రోత్సాహం
- వ్యవసాయ అనుబంధ పథకాలు
- కొత్తపేట మండలంలో నాలుగేళ్లలో రైతుల ఖాతాలకు రూ 22.42 కోట్లు జమ



వాడపాలెం రైతు భరోసా కేంద్రం

కొత్తపేట: ఒకప్పుడు వ్యవసాయ చేయాలంటే ప్రతి అవసరానికి మండల కేంద్రాలకు వెళ్లాల్సివచ్చేది. రోజుల తరబడి తిరిగినా ఆయా అవసరాలు తీరేవికావు. అప్పట్లో ఆయా ప్రభుత్వాల తీరుకు అనుగుణంగానే అధికారుల వ్యవహరించేవారు. సరైన సమాధానం చెప్పేవారు కాదు. మరోపక్క వరుస నష్టాలు ఎదుర్కొంటున్న అన్నదాతకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేక వ్యవసాయం దండగగా మారి రైతులు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యేవారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజాసంకల్ప పాదయాత్ర ద్వారా వైఎస్ జగన్ రైతుల కష్టాలను దగ్గరగా చూశారు. నేను ఉన్నాను అని భరోసా ఇచ్చారు. దానికనుగుణంగానే ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే ప్రజా, రైతు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారు. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం అని చెప్పడమే కాకుండా నాలుగేళ్ల నుంచి ఏటా ప్రతి సీజన్‌లో అమలు చేసి చేతల్లో చూపారు. గత టీడీపీ ప్రభుత్వంలోలా వ్యయ, ప్రయాసలతో మండల కేంద్రానికి వెళ్లవలసిన అవసరం లేకుండా గ్రామాల్లో రైతులకు అధికార యంత్రాంగాన్ని చేరువ చేసింది. రైతులకు అందుబాటులో అన్ని సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. వాటి ద్వారా రైతులకు పంట పెట్టుబడికి వైఎస్సార్ రైతు భరోసా, తుపాను భారీ వర్షాలకు పంట నష్టపోతే వైఎస్సార్ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రుణాలు, వైఎస్సార్ యంత్ర సేవ వంటి పథకాలు అమలు చేస్తున్నారు. కొత్తపేట మండలంలోని పది గ్రామాల్లో సుమారు 3,500 మంది రైతులు 8,121 ఎకరాలు వరి విస్తీర్ణంలో వరి పంట, సుమారు 3,750 మంది రైతులు 9,697.50 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	7,676	13.82
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	5,114	4.29
వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీ	4,451	2.04
కౌలు రైతు కార్డులు	3,050	2.30
మొత్తం	20,291	22.42

ఏ సీజన్ నష్టానికి ఆ సీజన్‌లోనే పరిహారం

గత ప్రభుత్వ హయాంలో తుపాను, భారీ వర్షాలకు పంటలు నష్టపోతే సర్వేకు మాత్రమే పరిమితమయ్యేది. ఎప్పుడైనా పరిహారం ఇచ్చినా కంటి తుడుపుగానే రైతులకు అరకొరగానే పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించేవారు. అది కూడా పంట నష్టం జరిగిన రెండు, మూడేళ్లకు అందేవి. దీనిలో జన్మభూమి కమిటీల పాత్ర, వారి సిఫారసు ఉన్న రైతులకు మాత్రమే మంజూరు అయ్యేవని అప్పట్లో ఆరోపణలున్నాయి. కానీ నేటి జగన్ ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్‌లకు ముందే పంట పెట్టుబడి కింద రైతు భరోసా, ఏ సీజన్‌లో పంట నష్టానికి ఆ సీజన్‌లోనే పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పథకం సాయం అందజేస్తూ రైతులను ఆదుకుంటుంది.

అందుబాటులో సేవలు



గతంలో మండలానికి ఒక వ్యవసాయ అధికారి, వారికి ఇద్దరు సహాయకులు ఉండేవారు. రైతులు ప్రతి పనికి మండల కేంద్రంలో అధికారుల చుట్టూ తిరగాల్సివచ్చేది. నేటి వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రజలకు చేరువలో ఏర్పాటు చేసిన ప్రతి సచివాలయం పరిధిలో వ్యవసాయానికి సంబంధించి ఒక ఆర్‌బీకేను ఏర్పాటు చేశారు. ఆ కేంద్రంలో వీఏఏను, ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను రైతులకు అందుబాటులో నియమించారు. వారు ద్వారా సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నారు.

– పెదపూడి త్రిమూర్తి శ్రీనివాస్, ఎంఏఎంసీ చైర్మన్, కొత్తపేట

ధైర్యంగా సాగు చేస్తున్నాం



నేను సుమారు 9 ఎకరాల వరి సాగు చేస్తున్నాను. గతంలో వ్యవసాయ అవసరాల నిమిత్తం మండల కేంద్రం కొత్తపేట వెళ్లాల్సి వచ్చేది. చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రం రూపంలో వ్యవసాయ శాఖ రైతులకు అందుబాటులోకి వచ్చింది. ఏ విధమైన బాధలు లేవు. అంతే కాకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.30 వేలు, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.9,150, ఇన్సూరెన్స్ కింద రూ.2,820 లబ్ధి పొందాను.

– కుడుపూడి సత్యనారాయణ, రైతు పలివెల ఖండ్రిగ

లాభసాటిగా వ్యవసాయం



నేను ఎకరంన్నర వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా సీఎం జగన్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి అనేక ప్రోత్సాహకాలు, రైతు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. గతంలో వర్షాలు, తుపాన్లు వచ్చి పంట నష్టపోతే నష్టపరిహారం సకాలంలో వచ్చేది కాదు. అనేక సార్లు రాసుకెళ్లటమే కాని పరిహారం ఇచ్చింది లేదు. ఈ ప్రభుత్వంలో నష్టం రాసికెళ్లిన కొద్ది రోజుల్లోనే నష్టపరిహారం అందిస్తున్నారు.

– గుండుపల్లి బుల్లియ్య, రైతు, పలివెల

ప్రతి క్షణం.. ప్రజల పక్షం..

మామిడికుదురు: ప్రతి నిత్యం, ప్రతిక్షణం, వైఎస్సార్ సీపీ ప్రజల పక్షమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఏడో రోజు పెదపట్నంలంకలో జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆప్యాయంగా మాట్లాడారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు ప్రతినిత్యం ప్రజలతోనే ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఇచ్చిన హామీలను చాలా వరకు నెరవేర్చామని, ఆ ధీమాతోనే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తున్నామని ఎమ్మెల్యే చిట్టిబాబు చెప్పారు. ఏ ఒక్కరిని పలకరించినా ప్రతి ఇంట సంక్షేమ పథకాల ఫలాలు అందుకున్న ఆనందం లబ్ధిదారుల మాటల్లో కనిపిస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పని చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయం అందించి జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలని చిట్టిబాబు కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు బయ్యా తాతాజీ, గెద్దం ఏసుదాసు, పల్లి సత్యనారాయణ, మేడిద ప్రమోద్, బూల నరేష్, పల్లి ఏసురత్నం, రాయుడు ఆనంద్, విప్పర్తి నాగేశ్వరరావు, కొమ్ముల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొత్తపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలతో పాటు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి అన్నారు. మండలంలోని ఖండ్రిగ పంచాయతీ పరిధిలోని అల్లపల్లివారిపాలెం, గుబ్బల వారిపాలెం రోడ్డు సీసీ రోడ్డుగా అభివృద్ధికి గడప గడపకు కార్యక్రమం ద్వారా రూ 7.60 లక్షలు, జెడ్పీ నిధులు రూ.2 లక్షలు మంజూరు కాగా శనివారం ఎంపీపీ, జెడ్పీటీసీలు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో గుర్తించిన రోడ్లు, డ్రైన్లు వంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరుతో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఇటువంటి రోడ్లకు మోక్షం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దూనబోయిన నవదీప, ఎంపీటీసీ పితాని లక్ష్మీతులసి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బొక్కా సత్యనారాయణ, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

వాహనదారులకు కంటి పరీక్షలు

రావులపాలెం: స్థానిక ఈతకోట టోల్ ప్లాజా వద్ద శనివారం కంటిచూపు పరీక్షలు శిబిరాన్ని నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన శిబిరంలో వేమగిరి పరమహంస నేత్రాలయం డాక్టర్ గౌతమ్, సిబ్బంది వైద్య సేవలు అందించారు. సుమారు 75 మందికి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. ఈ శిబిరాన్ని టోల్ మేనేజర్ కేవీఎస్ఎన్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో హైవే సిబ్బంది సురేష్, రవితేజ, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 31 వరకు సెక్షన్ 30 అమలు



డీఎస్పీ కేవీ రమణ

కొత్తపేట: స్థానిక పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 31 రోజుల పాటు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తూ నిషేధాజ్ఞలు విధించినట్టు డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం నుంచి ఈ నెల 31 వ తేదీ వరకూ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీల్లేదని పేర్కొన్నారు. కొత్తపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, నగరం, రాజోలు, సఖినేటిపల్లి, మలికిపురం పోలీసు స్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ఉత్తర్వులు ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాకినాడ వెళ్లి.. పింఛన్ అందించి



కాకినాడ జీజీహెచ్‌లో దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

పి.గన్నవరం: మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన మాతా శ్రీరామ్ అనే దివ్యాంగుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ కోరుకొండ రాంబాబు శనివారం సర్పంచ్ వదలి కొండయ్య, ఎంపీటీసీ పుల్లపర్తి రాజారావులతో కలసి కాకినాడ వెళ్లి శ్రీరామ్‌కు పింఛన్ అందించారు. కాకినాడకు వెళ్లి పింఛన్ అందించిన రాంబాబును పలువురు అభినందించారు. దివ్యాంగుడు శ్రీరామ్‌ను గ్రామ నాయకులు ఆచంట వెంకన్నబాబు, సవ్వితి చినబాబు, ఎం.గోపాలకృష్ణ, నాగేశ్వరరావు పరామర్శించారు.

మురుగునీరు వెళ్లే తూరలను మూయవద్దు

అంబాజీపేట: పంట పొలాల్లోని మురుగునీరు వెళ్లే డ్రైన్‌లను మూసివేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇసుకపూడి బందగట్టు ప్రాంత రైతులు అధికారులను కోరుతున్నారు. బందగట్టు ప్రాంతం ఏరియాలో సుమారు 35 ఎకరాల వరి సాగు చేస్తున్నామని, ఈ భూములను ఆనుకుని కొంత మంది లే అవుట్ చేసి మురుగునీరు వెళ్లే తూరలను మూసివేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం నుంచి వరి చేలల్లో మురుగు నీరు ఈ తూరల నుంచే బయటకు వెళుతుందన్నారు. ఈ తూరలు మూసివేయడం వల్ల మురుగు నీరు బయటకు వెళ్లే మార్గం లేదని, తక్షణమే ఆక్రమణకు గురైన తూరలను మూసివేయకుండా నిలుపుదల చేయవద్దని రైతులు కోరుతున్నారు.

వినూత్న కార్యక్రమాల అమలు జగన్‌కే సాధ్యం

సఖినేటిపల్లి: సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తన దైన శైలిలో సీఎం జగన్ వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తూ రికార్డు సృష్టిస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం అప్పనరామునిలంకలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఐందుకూరి సుబ్బరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, పీఏసీఎస్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు బర్రే రాము, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మురికి నీరు వస్తోందని ఆందోళన

మామిడికుదురు: కుళాయిల నుంచి తీవ్ర దుర్గంధంతో కూడిన మురికి నీరు వస్తోందంటూ స్థానికులు శనివారం సాయంత్రం నిరసన తెలియజేశారు. పది రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని, కుళాయిల ద్వారా వచ్చే తాగునీరు కూడా అంతంత మాత్రంగానే వస్తోందని వాపోయారు. తాగునీటిలో చిన్న చిన్న చేప పిల్లలు కూడా వస్తున్నాయని, ఈ నీరు తాగడం వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని వాపోయారు. తాగునీటి ట్యాంకు వద్ద మ్యాన్‌హోల్ పల్లంలో ఉండడం వల్ల దానిలోకి డ్రైన్ నీరుతో పాటు ముంపు నీరు కూడా వెళ్లడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనిపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మాజీ ఎంపీటీసీ యాండ్ర పద్మ, భూపతి దామోదరరావు, నేల కుమారస్వామి, బైరిశెట్టి మహాలక్ష్మి, గూటం శాంతకుమారి, మట్టపర్తి విజయలక్ష్మి పాల్గొన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వ్యవసాయ రుణాలపై అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: రామేశ్వరం పంచాయతీ వద్ద శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాలపై వ్యవసాయ శాఖ నిరుపేద కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు 12 శాతం వడ్డీపై పంపిణీ చేసే అంశంపై రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ మాట్లాడుతూ, పేద కౌలు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ సకాలంలో రైతులకు వ్యవసాయ రుణాలు అందించి సాయపడాలని బ్యాంకు అధికారులను కోరారు. తహసీల్దార్ వై.రామకుమారి, ఏవో వీవీ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మకం జగనన్న సురక్ష

- ప్రారంభమైన జేసీఎస్ సేవలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, నాయకులు



అంతర్వేది దేవస్థానంలో జగనన్న సురక్ష క్యాంపు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక



ముక్కామలలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



ఊబలంక జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

అంబాజీపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష సేవలు(జేసీఎస్) విప్లవాత్మక కార్యక్రమమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పసలపల్లి, ముక్కామల గ్రామాల్లో ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారుల పర్యవేక్షణలో సర్పంచ్ మట్టపర్తి నాగరాజు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన తొమ్మిది రకాల ధ్రువీకరణ పత్రాలను అక్కడికక్కడే అందించనున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: జగనన్న సురక్షలో భాగంగా పి.గన్నవరం-1, 2 గ్రామ సచివాలయాల పరిధిలోని 859 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను చిట్టిబాబు అందజేశారు. గ్రేస్ కళాశాల ఆవరణలో ఎంపీడీఓ ఎం.భారతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ దాసరి మానిక, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: అయినవిల్లి సచివాలయం-1 వద్ద సర్పంచ్ కాశర శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలువురికి జగనన్న సురక్ష పథకంలో ఉచితంగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే అయినవిల్లిలంకలో తహసీల్దార్ నాగలక్ష్మమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

సత్వర పరిష్కార వేదిక

సఖినేటిపల్లి: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు, సేవలు అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రారంభించారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం అంతర్వేది దేవస్థానం సచివాలయం-1లో జగనన్న సురక్ష క్యాంపును ఆయన ప్రారంభించారు. క్యాంపులో ఎంపీడీవో, తహసీల్దారు వై.రామకుమారి ఆధ్వర్యంలో సిద్ధం చేసిన ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్, ఎంపీటీలు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలోని దిండి, మేడిచర్లపాలెంలలో శనివారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు 781 మందికి వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయా గ్రామాలలో సర్పంచ్‌లు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వీటిని లబ్ధిదారులకు అందజేశారు. ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రావులపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అధికారులు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఊబలంకలో జగనన్న సురక్ష క్యాంపును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా చేపట్టిన జగనన్న సురక్ష క్యాంపులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని అందరికీ అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మల్లిడి లావణ్య, సర్పంచ్ కొక్కిరగెడ్డ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: రాష్ట్రంలోని అర్హులైన ప్రజానీకానికి ప్రభుత్వ పథకాలు అందించాలనే జగనన్న సురక్ష క్యాంపులను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని చెముడులంక, పెదపళ్ల గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష పథకాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. చెముడులంకలో తహసీల్దార్ ఐవీ శెట్టి, పెదపళ్లలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యంలో 837 మందికి ధ్రువ పత్రాలను అందజేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక, పేరవరం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు నరాలశెట్టి సుబ్బలక్ష్మి, గంటి విజయభారతి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువపత్రాలను 2018 మందికి అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందని సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు అన్నారు. శనివారం సోంపల్లి, బి.సావరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించారు. తహసీల్దారు టీఎం ముక్తేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ అధ్వర్యంలో రెండు బృందాలు సోంపల్లిలో 900, బి.సావరంలో 800 వివిధ రకాల ధ్రువపత్రాలను మంజూరు చేశారు.

కొత్తపేట: ప్రజా సమస్యలను పరిష్కరించడం, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికీ ఆయా పథకాలు అందించడమే ఈ జగనన్న సురక్ష లక్ష్యమని స్థానిక ఆర్డీఓ ఎం.ముక్కంటి అన్నారు. మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తొలుతగా శనివారం ఖండ్రిగలో ప్రారంభించారు. సర్పంచ్ దూనబోయిన నవదీప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ ముక్కంటి, ఆముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి పాల్గొన్నారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి 735 మంది దరఖాస్తు చేసుకోగా 615 మందికి ఆయా పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పితాని లక్ష్మీతులసి, ఆవిడి, గంటి సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా సేవలు

మామిడికుదురు: మామిడికుదురు గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పలువురికి తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య కుమార్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

సఖినేటిపల్లి: మండలంలోని వీవీ మెరక మొండికోడు చానల్ ఏరియాలోని 6, 7 వార్డుల్లో నెలకొని ఉన్న తాగునీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరుతూ శనివారం సదరు సర్పంచ్ ఓగూరి రత్నకుమారికి ఆ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయానికి వెళ్లి వారంతా లిఖితపూర్వకంగా సర్పంచ్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ వారికి హామీ ఇచ్చారు.

అమ్మఒడి పథకానికి దేశవ్యాప్త కీర్తి

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకానికి దేశవ్యాప్త కీర్తి లభించిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం కడలి ఉన్నత పాఠశాలలో అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థులకు మంజూరైన మొత్తం నమూనా చెక్కును ఎమ్మెల్యే రాపాక ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ రాజోలు మండలంలో 5,655 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో అమ్మ ఒడి పథకం సొమ్ములు జమ చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చివేశారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. సర్పంచ్ చొప్పల గుణనాథ్, అడబాల బ్రహ్మాజీ, సూరిశెట్టి బాబి, కంచర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.